క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం



తాడేపల్లిరూరల్: పట్టణ పరిధిలోని సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళా శాసనాలతో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆశ్రమం పరిసర ప్రాంతాల్లో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మరియు వికాస తరంగిణి సంయుక్తంగా వివిధ రకాల మొక్కలు నాటినట్లు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి మహిళా కార్యకర్తలు, కృష్ణధర్మ రక్షణ వ్యవస్థాపకులు కె.డి.ఆర్., వేద విద్యార్థులు పాల్గొన్నారు.

తాడికొండలో 4 నామినేషన్‌లు

తాడికొండ: తాడికొండ అసెంబ్లీ స్థానానికి మొత్తం 4 నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత, బహుజన సమాజ్‌వాద్ పార్టీ అభ్యర్థిగా శృంగారపాటి బాబూరావు, ఇండిపెండెంట్ అభ్యర్థి కొప్పుల దివ్యవాణి, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి తెనాలి రమేష్ బాబు నామినేషన్‌లు దాఖలు చేశారు. మొత్తం 4 అభ్యర్థుల నుంచి 6 సెట్ల నామినేషన్ పత్రాలు అందినట్లు ఆయన తెలిపారు. గతంలో టీడీపీ, ఇండిపెండ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా మొత్తం 6 అభ్యర్థుల నుంచి ఇప్పటి వరకు 8 సెట్ల నామినేషన్ పత్రాలు అందినట్లు ఆర్వో తెలిపారు.



తాడికొండ అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా తరలివెళ్తూ అభివాదం చేస్తున్న మేకతోటి సుచరిత, ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య



ర్యాలీలో ఆనందోత్సాహాల నడుమ డ్యాన్స్ వేస్తున్న మహిళలు



ట్రాక్టరు నడిపి కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్న ఎమ్మెల్యే సుచరిత

పేదల అభివృద్ధే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి

తాడేపల్లి రూరల్: రాజధాని ప్రాంతంలో ఏ ప్రభుత్వం అభివృద్ధి చేసిందో ఇక్కడ ఉన్న ప్రజలందరికీ తెలుసుని, అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకుని అభివృద్ధికి సహకరించాలని మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుడుగు లావణ్య, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల అన్నారు. సోమవారం రాత్రి రాజధాని ప్రాంతలైన మంగళగిరి రూరల్, నీరుకొండ, బేతపూడి, తదితర ప్రాంతాల్లో రోడ్‌షోతో పాటు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు లావణ్యకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. పలు చోట్ల జాతీయ నాయకులు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నియోజకవర్గంలో ఫ్యాను హవా కొనసాగుతోందని ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన జరుగుతోందన్నారు. రాబోవు రోజుల్లో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యలను గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రత్నకుమారి పాల్గొన్నారు.



మంగళగిరిలో రోడ్‌షో నిర్వహిస్తున్న లావణ్య

మంగళగిరి(తాడేపల్లిరూరల్): పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, వారి అభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగించారని వైఎస్సార్ సీపీ మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణ పరిధిలోని ఒకటో వార్డులో ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి, లావణ్య మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఓ ఓసీ అభ్యర్థిని కాదని బీసీ మహిళకు టికెట్ ఇచ్చారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాధికారంలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం కల్పిస్తూ మన నియోజకవర్గాన్ని బీసీ మహిళకు కేటాయించారని, పేద ప్రజలందరికీ అందుబాటులో ఉండే లావణ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా చేనేత అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, సంకె సునీత, ఎండీ ఫిరోజ్, మల్లవరపు సుధారాణి, గుండా మధు, కాండ్రు శివనాగేంద్రం, బిట్రా శ్రీనివాసరావు, జొన్నాదుల గోవర్ధన్, కురగంటి ఆదాం, కృష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డగ శివపార్వతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. తాడేపల్లి 11వ వార్డులో గుంటూరు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు, మైనార్టీ సెల్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎండీ గోరే ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడారు. పట్టణ పరిధిలోని 2, 6,18,14 వార్డులలో తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీరోజ, ఉండ్రు కళ్యాణ్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుంచాల శ్రీనివాసరావు, కె. రమేష్, పర్వీన్, అజీజ్, చింతపల్లి శ్రీను, శ్రీధర్, జిలాని, ఆనందరావు, వేముల శివ, హరినాథ్ రెడ్డి, గోవర్ధన్, గోపిచంద్, విజయ్, గడ్డం కోటిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

30వ తేదీలోపు పన్నులు చెల్లించండి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్నులు ఈ నెల 30వ తేదీలోపుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చని కమిషనర్ నిర్మల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

పది ఫలితాల్లో సర్కార్ స్కూళ్ల సత్తా



ఎస్‌డీ మొహమ్మద్ -582



సారిక - 582



ఎస్‌కే మహీరా - 572



మీనాక్షి - 565

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో 80 శాతం మంది ఉత్తీర్ణత నమోదు అయింది. బీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎస్‌డీ మొహమ్మద్ 582 మార్కులు, చినకాకాని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సారిక 582 మార్కులు సాధించారు. తాడేపల్లి రూరల్ మండలంలోని పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎస్‌కే మహీరా 572 మార్కులు, కొడాలి దీపిక 550, దుగ్గిరాల గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.మీనాక్షి 565, పెదపాలెంకు చెందిన విద్యార్థి లామ్ చిన్ని మధురిమ 530 మార్కులు సాధించింది.

తాడికొండ విద్యార్థులు..

తాడికొండ: పదో తరగతి పరీక్ష ఫలితాలలో తాడికొండ మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభ చూపించి సత్తా చాటారు. మండలంలో మొత్తం 694 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 616 మంది పాస్ కాగా, 66 మంది ఫెయిల్ అయ్యారు.

ఫిరంగిపురం: మండలంలోని 11 పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 95శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ మహబూబు సుభాని సోమవారం తెలిపారు.

యాపిల్ విద్యార్థుల ప్రతిభ

మేడికొండూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని పేరేచర్ల యాపిల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. యాపిల్ పాఠశాలకు చెందిన విద్యార్థి వై.సాయివెంకటేష్ (593 మార్కులు), కె.పూజ్యశ్రీ (591 మార్కులు) సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. అత్యధిక మార్కులు సాధించడం గర్వకారణమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ రవికుమార్ అభినందించారు.

26లోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి



రాజకుమారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల విధుల ఉత్తర్వులు అందుకున్న ప్రిసైడింగ్ అధికారులు, ఇతరులు ఫారం 12 అప్లికేషన్‌ను ఈనెల 26వ తేదీలోగా అందజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి కోరారు. సోమవారం మంగళగిరిలోని ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల విధుల ఉత్తర్వులు అందుకున్న ప్రిసైడింగ్ అధికారులు,ఇ తర పోలింగ్ అధికారులు, పోలీసులు, సెక్టార్ అధికారులు, బూత్ లెవల్ అధికారులు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియో గ్రాఫర్లు, బందోబస్తు కొరకు ఉత్తర్వులు అందుకున్న ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, మాజీ సరీస్ మెన్ ఇతర యూనిఫాం సర్వీస్‌ల వారు పనిచేస్తున్న జిల్లాలోనే సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రెండు ఫారం 12 అప్లికేషన్‌లను(ఒకటి పార్లమెంట్‌కు, రెండోవది అసెంబ్లీకి) ఎన్నికల విధుల నియామక ఉత్తర్వులు మరియు ఓటరు కార్డు ప్రతిని జతపరచి ఈనెల 26వ తేదీలోగా సమర్పించాలని, ఓటు వేయడానికి ఆఖరి తేది మే 8వ తేదీ అని, ఈ ఫెసిలిటేషన్ వివరాలను ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులకు, రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు ముందుగానే సమాచారం అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

అనధికార నిర్మాణాలను గుర్తించాలి

ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార నిర్మాణాలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశించారు. సోమవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అనధికార కట్టడాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని, అనధికార హోర్డింగ్‌లు, అభ్యంతరకరమైన ఆక్రమణలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను గుర్తించి వారికి నోటీసులు అందజేయాలని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని, అగ్ని భద్రతా చర్యలు లేని భవనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్న అనుమతి లేని హోర్డింగ్‌లు, డిస్‌ప్లే బోర్డులకు జరిమానా విధించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డి.సి.పి. అశోక్ కుమార్, టీపీఓ. రమేష్ బాబు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కొత్తపేటలో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాములు కల్యాణం నిర్వహించారు. కాగా సోమవారం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

కూటమి నాయకుల అవకాశ వాద రాజకీయాలు

తాడేపల్లిరూరల్: ముస్లిం మైనార్టీ రిజర్వేషన్లపై బీజేపి నేతల అక్కసుపై, ముస్లింలపై మత విద్వేషాలను వ్యాప్తి చేసేలా ఉన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాష్ట్రంలో టీడీపీ, జనసేన నాయకులు ఇప్పటికీ నోరు విప్పకపోవడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని విమర్శించారు. సోమవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోనే మేలు జరిగిందన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాను సాహెబ్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన కార్యకర్తలు

మేడికొండూరు: వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మేకతోటి సుచరిత నామినేషన్‌కు మండలంలోని పలు గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలి వెళ్లారు. ఎండను లెక్క చేయకుండా తమ అభిమానాన్ని చాటుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని 14 గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లారు.

ఫిరంగిపురం: తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ మేకతోటి సుచరిత వేయనుండటంతో మండలంలోని పలుగ్రామాల నుంచి అభిమానులు తాడికొండకు సోమవారం తరలివెళ్లారు. అడుగడుగునా అభిమానం , ఉప్పొంగిన ఉత్సాహంతో అన్ని గ్రామాల నుంచి మహిళలు, అభిమానులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు ఉదయాన్నే చేరుకున్నారు.

మోదీ మోసగాళ్లకే మోసగాడు

తాడేపల్లిరూరల్: చంద్రబాబు మోసగాడైతే మోదీ మోసగాళ్లకే మోసగాడు అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పేర్కొన్నారు. సోమవారం మంగళగిరి అసెంబ్లీ స్థానానికి ఆ పార్టీ అభ్యర్థిగా జొన్నా శివశంకర్ నామినేషన్ వేశారు. ఈసందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ లౌకికత్వాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనా కాలంలో చేసింది ఏమీ లేదని అన్నారు. స్పెషల్ స్టేటస్ ఇస్తానని ద్రోహం చేసిన ద్రోహి బీజేపీ అని విమర్శించారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.